రాయితీపై అదనపు విద్యుత్ లోడ్ క్రమబద్ధీకరణ

- ఏపీఈపీడీసీఎల్ ఈఈ సురేష్‌బాబు


కొత్తగా ప్రారంభించిన ఫీడర్ వద్ద ఈఈ సురేష్‌బాబు తదితరులు

డెంకాడ: అదనపు విద్యుత్ వినియోగించే గృహ వినియోగదారులకు 50 శాతం రాయితీపై అదనపు లోడ్ క్రమబద్ధీకరణ చేయడం జరుగుతుందని ఏపీఈపీడీసీఎల్ విజయనగరం రూరల్ ఈఈ జి.సురేష్‌బాబు తెలిపారు. వచ్చే నెల 30వ తేదీలోపు క్రమబద్ధీకరణ చేసుకున్న వారికి మాత్రమే 50 శాతం రాయితీ వర్తిస్తుందన్నారు. ఒక కిలోవాట్ వినియోగించే వారికి క్రమబద్ధీకరణకు ప్రస్తుతం రూ.2250లు కాగా రాయితీ పోను 1250 మాత్రమే చెల్లిస్తే సరిపోతుందన్నారు. 2 కిలోవాట్లకు రూ.4450లు కాగా రూ.2450లు చెల్లిస్తే చాలన్నారు. 3 కిలోవాట్లు వాడే వినియోగదారులు రూ.6650లు కాగా రూ.3350లు చెల్లిస్తే సరిపోతుందని పేర్కొన్నారు. 4 కిలోవాట్ల లోడ్‌ను క్రమబద్ధీకరించాలంటే రూ.8850లు కాగా రాయితీ పోను రూ.4850 చెల్లిస్తే చాలన్నారు. 5 కిలోవాట్లు వినియోగించే వారు రూ.11050 బదులుగా రూ.6050 చెల్లిస్తే సరిపోతుందని వివరించారు. 5 కిలోవాట్ల లోడ్ దాటిన తర్వాత నుంచి ప్రతి కిలోవాట్‌కు రూ.2000 చెల్లించాల్సి ఉన్నప్పటికీ వచ్చే నెల 30వ తేదీలోపు 50 శాతం రాయితీ దీనికి కూడా వర్తిస్తుందన్నారు. దరఖాస్తు ఫీజు రూ.50, సెక్యూరిటీ డిపాజిట్ రూ.200 చెల్లించాలన్నారు.

కొత్త ఫీడర్ ప్రారంభం..

మండలంలోని మోదవలస సబ్‌స్టేషన్‌లో రూ.30 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన కొత్త ఫీడర్‌ను ఈఈ సురేషబాబు చార్జ్ చేసి ప్రారంభించారు. దీంతో మండలంలోని కొండరాజుపేట, బంగారాజుపేట, మోపాడ గ్రామాలకు లోటల్టేజి సమస్య తీరడంతో పాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం చాలా వరకూ తగ్గుతుందని ఈఈ తెలిపారు.

క్లుప్తంగా

స్టాపర్లు ఏర్పాటు


మోదవలస వద్ద ఏర్పాటు చేసిన స్టాపర్లు వద్ద పోలీసులు

డెంకాడ: రహదారి భద్రతా నియమాలు పాటించడం మనందరి బాధ్యత అని ఎస్‌ఐ ఎ.సన్యాసినాయుడు అన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణ చర్యల్లో భాగంగా మండల పరిధిలోని విజయనగరం–విశాఖపట్నం, విశాఖపట్నం–శ్రీకాకుళం రహదారుల్లో శనివారం స్టాపర్లు ఏర్పాటు చేశారు. ఎస్పీ వకుల్ జిందల్ ఆదేశాల మేరకు మోదవలస వద్ద భారీ టైర్లు వాటికి రేడియం స్టిక్కర్లు అతికించి రాత్రిపూట వచ్చే వారికి కూడా కనిపించేలా తయారు చేసి రోడ్డుపై ఉంచామని ఎస్‌ఐ తెలిపారు. ప్రతిఒక్కరూ జాగ్రత్తగా ప్రయాణించాలని, పరిమిత వేగంతో సురక్షిత ప్రయాణం చేయాలని ఆకాంక్షించారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు


రికార్డులు తనిఖీ చేస్తున్న కమిషనర్ నల్లనయ్య

విజయనగరం: విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య హెచ్చరించారు. నగరంలోని రెండో నంబరు సచివాలయాన్ని ఆయన శనివారం ఆకస్మికంగా సందర్శించారు. రికార్డులు, విజిట్ బుక్‌లు తనిఖీ చేసి, పలు సూచనలు చేశారు. నిర్ణీత సమయానికి విధులకు హాజరుకావాలని, ప్రజాసమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని తెలిపారు. సచివాలయ పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలన్నారు. పౌరసేవలు సమయానికి అందించాలన్నారు.

విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేత


ప్రశంసాపత్రాలతో విద్యార్థులు, నిర్వాహకులు

విజయనగరం టౌన్: స్థానిక గురజాడ స్వగృహంలో వాగ్దేవీ సమారాధనం సంస్థ నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరంలో శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులకు శనివారం ప్రశంసాపత్రాలు అందజేశారు. విద్యార్థుల్లో నైతిక విలువలు పెంచే విధంగా 10 రోజుల పాటు పిల్లలకు నిష్ణాతులైన వారితో శిక్షణ ఇచ్చామని సంస్థ వ్యవస్థాపకురాలు పెన్నేటి స్వప్నహైందవి తెలిపారు. రానున్న రోజుల్లో మరిన్ని కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో తెలుగు భాషా పరిరక్షణ సమితి అధ్యక్షుడు సముద్రాల గురుప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నీతిపద్యాలపై అవగాహన

డెంకాడ: వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా స్థానిక శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు నీతిపద్యాలపై శనివారం అవగాహన కల్పించారు. లైబ్రేరియన్ వై.మహేష్.. గ్రంథాలయానికి వచ్చిన విద్యార్థులకు నీతిపద్యాలు–వాటి భావం తెలిపారు. నీతిపద్యాలే విద్యార్థుల్లో నైతిక విలువలు పెంపొందిస్తాయని, ప్రతిఒక్కరూ నీతి పద్యాలు చదివి అర్థం చేసుకోవాలని ఆయన కోరారు.

ఆలయ వార్షికోత్సవానికి సర్వం సిద్ధం

విజయనగరం టౌన్: స్థానిక బొండాడ వీధిలో కొలువైన కామాక్షి అమ్మవారి ఆలయ వార్షికోత్సవానికి సర్వం సిద్ధం చేసినట్లు పాలక మండలి అధ్యక్షుడు నాగుమల్లి శ్రీనివాసరావు తెలిపారు. ఉత్సవాలకు సంబంధించిన ఆహ్వాన పత్రికలను ఆలయంలో శనివారం ఆవిష్కరించారు. ఈ నెల 31 నుంచి జూన్ 2వ తేదీ వరకు మూడు రోజుల పాటు వేడుకలు నిర్వహిస్తున్నామన్నారు. 31న అమ్మవారి మూలవిరాట్టుకు పంచామృతాలతో అభిషేకాలు, ప్రత్యేక పూజలు, ఆభరణాల అలంకరణ, ధ్వజారోహణం, కలశ స్థాపన, జూన్ 1న ఏకాంబరేశ్వరస్వామికి అష్టోత్తర కలశ సహిత గ్రామోత్సవం, కుంకుమ పూజలు, 2న అమ్మవారికి 108 మంది సువాసినీలతో కుంకుమార్చనలు చేయనున్నామని పేర్కొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

డెంకాడ: మండలంలోని ఏపీఎస్పీ బెటాలియన్ వద్ద ఉన్న విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలకు ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతున్నట్లు విద్యుత్ శాఖ ఈఈ జి.సురేష్‌బాబు ఓ ప్రకటనలో శనివారం వెల్లడించారు. విద్యుత్ లైన్‌ల నిర్వహణ కారణంగా చింతలవలస, ఏపీఎస్పీ బెటాలియన్, రఘుమండ, గుండాలపేట, బొద్దవలస, కృష్ణాపురం, వెలంపేట, గెద్దవానిపాలెం, జొన్నాడ, ఆకులపేట, డి.తాళ్లవలస, దువ్వపేట, సత్యనారాయణపురం గ్రామాలతో పాటు చెల్లూరు ఇండస్ట్రియల్ ఫీడర్‌కు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామన్నారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కొనసాగే ఈ అసౌకర్యానికి చింతిస్తున్నామని, వినియోగదారులు గమనించి, సహకరించాలని కోరారు.

పరామర్శ


శ్రీనివాసరావును పరామర్శిస్తున్న శ్రీరాములునాయుడు తదితరులు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని కొత్తపేట సర్పంచ్ అట్టాడ శ్రీనివాసరావును వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి, సౌత్ సెంట్రల్ రైల్వే బోర్డు సలహా మండలి సభ్యుడు అంబళ్ల శ్రీరాములునాయుడు శనివారం పరామర్శించారు. ఇటీవల జనసేన పార్టీ కార్యకర్తలు శ్రీనివాసరావుపై దాడికి పాల్పడగా, గాయాలపాలై విజయనగరం జిల్లా కేంద్రాస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న శ్రీరాములునాయుడు ఆస్పత్రికి వెళ్లి, ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రజాప్రతినిధులపై దాడికి పాల్పడడం మండలంలో ఎన్నడూ జరగలేదన్నారు. ఇలాంటి విష సంస్కృతిని కూటమి ప్రభుత్వం ప్రోత్సహించడం విచారకరమన్నారు. ఆరోగ్యకర వాతావరణంలో రాజకీయాలు చేయాలే తప్ప ఇలాంటి దాడులకు పాల్పడితే భవిష్యత్‌లో ఇబ్బందులు ఎదుర్కోక తప్పదని హెచ్చరించారు. ఎల్లప్పుడూ ఒకటే ప్రభుత్వం ఉండదన్న విషయం గుర్తెరిగి మెలగాలన్నారు. ఆయన వెంట వైఎస్సార్ సీపీ నేతలు రాంబార్కి రామారావు, మత్స శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

విజయనగరం టౌన్: నగరంలో అవోపా(ఆర్య వైశ్య అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్) ఆధ్వర్యంలో ఆర్యవైశ్యుల వధూవరుల పరిచయ వేదికకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను శనివారం ఆవిష్కరించారు. జూలై 20వ తేదీన వధూవరుల పరిచయ వేదిక కార్యక్రమం నిర్వహిస్తామని, ఆర్యవైశ్యులందరికీ మేలు చేకూర్చాలన్నదే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశమని ఆ సంఘ నాయకులు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా గుంటూరు, విజయవాడ, రాయలసీమ, ఉత్తరాంధ్ర జిల్లాల్లో ఒకేసారి ఈ కార్యక్రమం చేపడుతున్నామన్నారు.

కూలర్ల ఏర్పాటుకు చర్యలు

విజయనగరం ఫోర్ట్: సబ్జీ కూలర్లు లేని రైతుబజార్లలో కూలర్లు ఏర్పాటు చేస్తామని జిల్లా వ్యవసాయ వాణిజ్య మార్కెటింగ్ అధికారి బి.రవికిరణ్ ఓ ప్రకటనలో శనివారం తెలిపారు. జిల్లాలోని ఏడు రైతుబజార్లు ఉండగా, వాటిలో కేవలం రెండింట్లో మాత్రమే సబ్జీ కూలర్లు ఉన్నాయని తెలియజేస్తూ ఈ నెల 24న సాక్షి దినపత్రికలో వార్తా కథనం ప్రచురితమైంది. ఈ మేరకు ఆయన స్పందిస్తూ మిగతా చోట్ల కూలర్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు.

పీహెచ్‌డీ పట్టా అందుకున్న 'కోరాడ'

చీపురుపల్లి: పట్టణంలోని వెంకటేశ్వరనగర్‌కు చెందిన కోరాడ వేణు ఆంధ్రా యూనివర్సిటీలో పీహెచ్‌డీ పూర్తి చేశాడు. ఈ మేరకు వర్సిటీ ఫిజికల్ ఎడ్యుకేషన్, స్పోర్ట్స్ సైన్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎన్.విజయ్‌మోహన్ నుంచి శనివారం పట్టా అందుకున్నారు. 'ఇంపాక్ట్ ఆఫ్ డిఫరెంట్ ట్రైనింగ్ మెథడ్స్ అండ్ కాంబినేషన్ ఆఫ్ ట్రైనింగ్ ప్రోగ్రామ్స్ ఆన్ సెలెక్టెడ్ సైకాలజికల్ అండ్ ఫిజికల్ వేరిబుల్స్ ఆఫ్ వాలీబాల్ ప్లేయర్స్' అనే అంశంపై రీసెర్చ్ చేసినట్లు వేణు తెలిపారు. వేణు ప్రస్తుతం అనిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో ఫిజికల్ డైరెక్టర్‌గా పని చేస్తున్నారు.

యోగాపై దృష్టి సారించండి

- ప్రముఖ యోగా గురువు శుభాకర్

గజపతినగరం: ప్రతిఒక్కరు యోగాపై దృష్టి సారించి ఆరోగ్యవంతమైన జీవితం గడపాలని ప్రముఖ యోగా గురువు శుభాకర్ (సంధ్యాల) తెలిపారు. శనివారం స్థానిక కల్కి భగవాన్ ధ్యాన మందిరంలో యోగా శిక్షకుడు శీరవాసు నిర్వహించిన ఉచిత యోగా శిక్షణ శిబిరంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆరోగ్యవంతమైన సమాజం కోసం శీరవాసు 2500 రోజులుగా యోగాపై శిక్షణ ఇవ్వడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో పలువురు యోగా శిక్షకులు పాల్గొన్నారు.

బృహత్తర ప్రణాళికపై అభ్యంతరాల స్వీకరణ


ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఏర్పాటు చేసిన బృహత్తర ప్రణాళికా చిత్రం

విజయనగరం: విశాఖ మెట్రోపాలిటన్ రీజియన్ డెవలప్‌మెంట్ అథారిటీ గతంలో రూపొందించిన బృహత్తర ప్రణాళికపై ప్రజల నుంచి అభ్యంతరాలు, అభిప్రాయాలు, సూచనలు కోరుతున్నామని నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య శనివారం తెలిపారు. 2021లోనే బృహత్తర ప్రణాళికను ఆమోదించడం జరిగిందని, ప్రస్తుతం వీఎంఆర్‌డీఏ పరిధిలోని పట్టణాలు, గ్రామాలకు రూపొందించిన బృహత్తర ప్రణాళిక–2041 ఆమోదం కోసం ప్రచారం చేయడం జరుగుతోందన్నారు. వీఎంఆర్‌డీఏ కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్ అందించిన వివరాల ప్రకారం 2041 బృహత్తర ప్రణాళికపై పునఃపరిశీలనకు సదరు ప్లాన్ పై అభ్యంతరాలు ఉంటే నిస్సందేహంగా తెలపవచ్చన్నారు. మే 22 నుంచి అభ్యంతరాల స్వీకరణ ప్రారంభమైందని, జూన్ 21వ తేదీ వరకు ప్రజలు తమ అభిప్రాయాలను రాతపూర్వకంగా గానీ పోస్టు ద్వారా తెలియజేయవచ్చన్నారు.

మాదకద్రవ్యాల నిర్మూలనకు కృషి చేయాలి


అవగాహన కల్పిస్తున్న సీఐ రవికుమార్

పూసపాటిరేగ: మాదక ద్రవ్యాల నిర్మూలనకు అందరం కలిసికట్టుగా కృషి చేయాలని భోగాపురం ఎక్సైజ్ సీఐ వి.రవికుమార్ కోరారు. మండలంలోని నడిపల్లి గ్రామంలో ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో కేర్ ప్రోగ్రాం నిర్వహించి, మాదక ద్రవ్యాల వల్ల కలిగే దుష్ప్రభావాలపై శనివారం అవగాహన కల్పించారు. గంజాయి, గుట్కా, సారా, మద్యం వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని తెలిపారు. ఎంతోమంది ఫ్యాషన్ మాయలో పడి చెడు అలవాట్లుకు గురై జీవితం నాశనం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే మద్యం షాపుల నిర్వాహకులంతా నిర్దేశిత సమయాల్లో మాత్రమే షాపులు తెరిచి విక్రయాలు చేపట్టాలని లేకుంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఉదయం 10 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు మాత్రమే మద్యం విక్రయాలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐలు చంద్రమోహన్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

నిగనిగంతా.. దగానే...!

- మామిడి కాయలను మగ్గించేందుకు విచ్చలవిడిగా రసాయనాల వినియోగం
- రంగు తప్ప రుచి లేని పండ్లతో ఆరోగ్యానికి ముప్పు
- అన్నీ తెలిసినా అందరిలోనూ ఉదాసీనతే...
- రైఫినింగ్ చాంబర్ల ద్వారా మగ్గబెట్టే పండ్లే ఉత్తమం


కొత్తవలస మర్కెట్‌లో కృత్రిమంగా పండించిన మామిడి పండ్లు


రైఫినింగ్ చాంబర్‌లో మామిడి పండ్లును మగ్గిస్తున్న దృశ్యం

కొత్తవలస: పట్టణంలో ఎక్కడ చూసినా మామిడి పండ్లు నిగనిగలాడుతూ కనిపిస్తున్నాయి. చూస్తే నోరూరేలా ఎంతో అందగా కనిపిస్తున్నాయి. అలా అని కొని నోట్లో వేసుకుంటే పుల్లగా, వగరుగా ఉంటున్నాయి. మామిడి కాయలు పక్వానికి రాకముందే కోసి రసాయనాల వినియోగంతో వాటిని పండ్లుగా మార్చేస్తున్నారు. మామిడి కాయలు పూర్తిగా పరువుకు వచ్చిన తర్వాతే సేంద్రియ పద్ధతిలో మగ్గపెడితే వాటి సువాసన వెదజల్లడంతో పాటు అత్యంత మధురంగా, రుచిగా ఉంటాయి. రసాయనాలతో మగ్గించిన పండ్లు రుచిగా ఉండవు సరికదా.. ఆరోగ్యానికి కూడా హానికరమని నిపుణులు హెచ్చరిస్తున్నారు. అంతేకాక ప్రజల ప్రాణాలతో చెలగాటమాడే ఈ ప్రక్రియ చట్టప్రకారం నేరం కూడా. అయినా అటు వ్యాపారులు , ఇటు కొనుగోలుదారులు ఇవేమీ పట్టించుకోవడం లేదు. నియంత్రించాల్సిన అధికారులు కూడా పట్టించుకోవడం లేదు. రసాయనాలతో మగ్గించిన పండ్లను తినడం వల్ల జీర్ణక్రియ సమస్యలు, క్యాన్సర్ వంటి సమస్యలేర్పడతాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. చాలా మంది వ్యాపారులు తమ ఇళ్లల్లో ఒక కొట్టుగదిలో మామిడికాయలను ఉంచి కార్బైడ్ ద్వారా మగ్గిస్తున్నారు. అలాగే కొన్ని రకాల రసాయనాలను నీటిలో కలిపి మామిడి కాయలను ఆ నీటిలో ముంచి పక్కన పెడితే ఒక్క రోజులోనే నిగనిగలాడుతో మెరుస్తుంటాయి. ఈ ప్రక్రియ ద్వారా పండ్లను కృత్రిమంగా మగ్గించడం వల్ల మంచి రంగు రావడంతో కొనుగోలుదారులు ఎగబడి మరీ కొనుగోలు చేస్తున్నారు. దీంతో అనారోగ్యాల బారిన పడుతున్నారు. రసాయనాలతో పండ్లను మగ్గిస్తే కనీసం మూడు నెలల జైలు శిక్ష, లక్ష రూపాయల వరకు జరిమాన విధించే అవకాశం ఉంది.

తగ్గిన మామిడి దిగుబడులు

జిల్లాలో 30,719 హెక్టార్లలో మామిడి పంట సాగవుతోంది. ఎకరాకి కనిష్టంగా ఐదు టన్నుల వరకు దిగుబడి వస్తుంది. మామిడి కాయలను స్థానికంగా విక్రయించడంతో పాటు కోల్‌కతా, ఢిల్లీ, తదితర రాష్ట్రాలకు ఎగుమతి చేస్తున్నారు. కాగా ప్రస్తుత ఏడాది గణనీయంగా దిగుబడులు తగ్గిపోయాయి. ఇతర రాష్ట్రాలకు ఎగుమతులు అంతంత మాత్రంగానే చేస్తున్నారు. నాసిరకం కాయలను రసాయనాలతో మగ్గించి స్థానికంగా అమ్మకాలు చేస్తున్నారు.

రాయితీపై రైఫినింగ్ కేంద్రాలు



రైఫినింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయాలనుకునే రైతులు, వ్యాపారులు సమీప సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలి. జనరల్ కేటగిరీ వ్యక్తులకు 50 శాతం రాయితీతో పథకం వర్తింపు జేస్తాం. పూర్తి వివరాలకు సచివాలయాల ఉద్యానవన సహాయకులను సంప్రదించాలి.

–పప్పు పద్మ, కొత్తవలస డివిజన్ ఉద్యానవనశాఖ అధికారి

కానరాని చెత్త సేకరణ



నెల్లిమర్ల నగరపంచాయతీలో గత నాలుగు రోజులుగా చెత్త సేకరణ నిలిచిపోయింది. ఎక్కడి చెత్త అక్కడే ఉండిపోయింది. మున్సిపాలిటీ పరిధిలో పనిచేస్తున్న 40 మంది పారిశుధ్య కార్మికులను కాలువల్లో పూడికలు తీసేందుకు కేటాయించారు. వాస్తవానికి రోజూ ఉదయం చెత్త సేకరణ చేసి, మధ్యాహ్నం కాలువల్లో పేరుకుపోయిన పూడికలు తొలగించాల్సి ఉంది. ఇప్పుడు అలా కాకుండా రెండు పూటలూ కాలువల్లోని పూడికలు తొలగించేందుకే సిబ్బంది పరిమితమైంది. దీంతో పట్టణంలో చెత్త కుప్పలుతెప్పలుగా పేరుకుపోయింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి, చెత్త తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

–నెల్లిమర్ల

ప్రమాదకరంగా కల్వర్టు గుంతలు



నెల్లిమర్లం మండలం, సీతారామునిపేట జంక్షన్ నుంచి కొత్తపేటకు వెళ్లే దారిలో గిరి ప్రదక్షిణ రోడ్డు పనులు నత్తనడకన కొనసాగుతున్నాయి. ఈ పనుల్లో భాగంగా జగనన్న కాలనీ మొదలుకుని, మొత్తం ఐదారు ప్రాంతాల్లో కల్వర్టుల నిర్మాణానికి భారీ గుంతలు(గోతులు) తవ్వారు. నెలలు గడుస్తున్నా ఆ గుంతలు కప్పకపోవడంతో ప్రమాదకరంగా మారుతున్నాయి. ఇటీవల వర్షాలకు మట్టి కరిగి గుంతలు పెద్దవి అయ్యాయి. కనీసం గుంతల వద్ద హెచ్చరిక బోర్డు కూడా ఏర్పాటు చేయకపోవడంతో అధికారుల తీరుపై స్థానికులు విమర్శలు వ్యక్తం చేస్తున్నారు. ఈ చిత్రంలో సీతారామునిపేట జగనన్న కాలనీ వద్ద ప్రమాదకరంగా తయారైన కల్వర్టు గుంతను చూడొచ్చు.

–నెల్లిమర్ల రూరల్

కమ్మేసిన కారుమబ్బులు



విజయనగరం జిల్లా కేంద్రాన్ని శనివారం కారుమబ్బులు కమ్మేశాయి. సాయంత్రం ఒక్కసారిగా దట్టంగా అలుముకున్న మేఘాలకు కాస్త చీకటి అయినా ఈ ఆహ్లాదకర వాతావరణాన్ని నగరవాసులు ఆస్వాదించారు. చల్లని వేళ ప్రకృతి అందాలు చూసి మురిసిపోయారు. పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో కమ్ముకున్న మబ్బులను ఈ చిత్రంలో చూడొచ్చు.

- సాక్షి ఫొటోగ్రాఫర్ విజయనగరం

'యోగాంధ్ర'ను విజయవంతం చేయాలి



భోగాపురం: విద్యార్థులతో యోగాసనాలు వేయిస్తున్న అధ్యాపకురాలు


పూసపాటిరేగ: మాట్లాడుతున్న ఎంపీడీవో రాధిక

పూసపాటిరేగ: యోగాంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీవో ఎం.రాధిక కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు, ఆరోగ్య సిబ్బందితో శనివారం ఆమె సమావేశమయ్యారు. ఆమె మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న యోగా శిక్షణా కార్యక్రమాలపై గ్రామస్థాయిలో అవగాహన చేయాలన్నారు. కార్మికులు, కర్షకులు, విద్యార్థులు, యువత, మహిళలంతా యోగా కార్యక్రమంలో పాల్గొనేలా చూడాలన్నారు. జూన్ 6న చింతపల్లిలో జరిగే యోగా యోగా కార్యక్రమానికి ప్రతి గ్రామం నుంచి 50 చొప్పున 7 బృందాలు హాజరయ్యేలా కార్యదర్శులు కార్యక్రమంపై అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ జ్ఞానేశ్వర రావు, సూపరింటెండెంట్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

విజయనగరం: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టే యోగాంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని, ప్రజలందరినీ కార్యక్రమంలో భాగస్వాములను చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య పిలుపునిచ్చారు. ఇదే విషయమై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కార్యదర్శులతో శనివారం సమావేశమై, పలు సూచనలు చేశారు. అంతకుముందు యోగాంధ్ర కార్యక్రమంలో పాల్గొనే క్యూఆర్ కోడ్, వెబ్‌సైట్‌ను విడుదల చేశారు. ఆన్‌లైన్ విధానం ద్వారా ప్రజలు తమ పేర్లను క్యూఆర్ కోడ్ ఉపయోగించి గానీ వెబ్‌సైట్‌లోకి వెళ్లి గానీ నమోదు చేసుకోవాలని తెలిపారు. జూన్ 21వ తేదీన జరిగే యోగా డే కార్యక్రమంలో ప్రజలంతా పెద్దఎత్తున పాల్గొనాలన్నారు. సచివాలయ పరిధిలో గానీ విశాఖపట్నంలో గానీ జరిగే కార్యక్రమంలో పాలుపంచుకోవాలన్నారు.

భోగాపురం: ఆరోగ్యవంతమైన జీవితానికి యోగా ఔషధంలా పనిచేస్తుందని అవంతి కళాశాల ప్రిన్సిపాల్ మురళీకృష్ణ తెలిపారు. మండలంలో చెరుకుపల్లి అవంతి ఇంజినీరింగ్ కళాశాలలో యోగా తరగతులు శనివారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా విజయనగరం గురజాడ జేఎన్‌టీయూ సూచనలతో నెల రోజుల పాటు యోగా తరగతుల నిర్వహణకు కళాశాలలో తరగతులు ప్రారంభించామన్నారు.